

బారులు తీరిన మద్యం లారీలు

నరసరావుపేట: వినుకొండ రోడ్డులోని ఇండియన్ మేడ్ లిక్కర్(ఐఎంఎల్) డిపోలో మద్యాన్ని దిగుమతి చేసేందుకు ఆదివారం లారీలు బారులు తీరాయి.



ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

వినుకొండ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు అగ్నిమాపక కేంద్రంలో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. అగ్నిమాపక అధికారి జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు ఆలయ తిరునాళ్ల



నాదెండ్ల: గణపవరం గ్రామదేవత పోలేరమ్మ, అంకమ్మ తల్లి ఆలయ వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి. భక్తులు మొక్కుబడులు చెల్లించి నైవేద్యాలు సమర్పించనున్నారు.

న్యూస్‌రీల్

నేడు టౌన్‌హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నరసరావుపేట: నరసరావుపేట పట్టణంలోని టౌన్‌హాలు వేదికగా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణంగా కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ వేదిక మార్పును ప్రజలు గమనించుకోవాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించడంలో భాగంగా ఈసారి నరసరావుపేట నియోజకవర్గాన్ని ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

ఘనంగా చెన్నుని పుష్పయాగం



మాచర్ల: మాచర్లలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. అర్చకులు కొండవీటి రాజగోపాలాచార్యులు, ఈఓ ఎం పూర్ణచంద్రరావు, జేపీ వీరారెడ్డి, గౌరవాధ్యక్షులు పోలిశెట్టి చంద్రశేఖరరావు, పందిరి సాంబశివరావు, షరాబు వెంకటరత్నం, గజవెల్లి కిషోర్, కంభంపాటి అనిల్‌కుమార్, నూరె యలమంద, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, కంభంపాటి వెంకటరమణలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి పుష్పయాగం మండపంలో జరిపారు. ఈ ఉత్సవాన్ని చూసిన భక్తులు జై చెన్నకేశవ, జై జై చెన్నకేశవ అంటూ నామస్మరణ చేశారు.

పట్టాలు తప్పిన సర్వీసు రైలు



దుగ్గిరాల: దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో మరమ్మతుల నిమిత్తం వచ్చిన సర్వీసు రైలు ఆదివారం సాయంత్రం పట్టాలు తప్పింది. అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. దీంతో గేటు వద్ద భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

కార్తికేయుని ఆలయంలో భక్తజన సందడి



మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తులతో క్యూలు సందడిగా మారాయి. అన్నప్రసాదం ప్రాంగణం వద్ద భక్తులు బారులు తీరి కనిపించారు. డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రికెట్ ఆడుతుండగా గుండెపోటు

యువకుడి దుర్మరణం



వినుకొండ: క్రికెట్ ఆడుతుండగా గుండెపోటుకు గురై యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలో శనివారం జరిగింది. టీడీపీ యూత్ ఆధ్వర్యంలో పట్టణంలోని కుమ్మరి బజారులో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక రణాహుస్సేన్ బజారుకు చెందిన షేక్ గౌస్‌బాషా (చంటి)(22) శనివారం సాయంత్రం క్రికెట్ ఆడుతూ గుండెపోటుకు గురయ్యాడు. దీంతో అతనిని స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం కొంతసేపటికి అతడు మృతి చెందాడు. మృతదేహాన్ని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, సీపీఐ నాయకులు సంద్రపాటి సైదా, డాక్టర్లు కేఎల్ రావు, కాసుల పార్వతి తదితరులు సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మృతుడు చంటి స్థానిక నిమ్స్ హాస్పిటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. మూడేళ్ల క్రితమే వివాహమైంది. తల్లిదండ్రులు, ముగ్గురు సోదరులు ఉన్నారు.

సన్నద్ధతకు సమయమేదీ?

- డీఎస్సీ నియామకాలపై అభ్యర్థుల పెదవి విరుపు
- నోటిఫికేషన్ కోసం ఎన్నాళ్లగానో 30వేల మంది అభ్యర్థుల నిరీక్షణ
- మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మే 20 నుంచి మాక్ టెస్ట్‌లు
- జూన్ 6 నుంచి జూలై ఆరు వరకు పరీక్షలు
- సన్నద్ధతకు 45 రోజులే వ్యవధి
- ప్రిపరేషన్‌కు కనీసం 90 రోజులు అవసరమంటున్న సబ్జెక్టు నిపుణులు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు విడుదల చేసిన డీఎస్సీ–2025 షెడ్యూల్ అభ్యర్థులకు కొత్త చిక్కులు తెచ్చి పెడుతోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మొదలు జూన్ ఆరో తేదీన పరీక్షల ప్రారంభానికి మధ్యలో 45 రోజులు మాత్రమే వ్యవధి ఉండటంతో అంత తక్కువ కాలంలో పరీక్షలకు సన్నద్ధం కావడం సాధ్యమేనా ? అని అభ్యర్థులు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తోందని సంతోషించాలో, సన్నద్ధమయ్యేందుకు కనీసం గడువు ఇవ్వకుండా హడావుడిగా షెడ్యూల్ జారీ చేసినందుకు బాధపడాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు.

45 రోజులు సరిపోవు

ఏడేళ్ల అనంతరం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు 45 రోజుల సమయం సరిపోదని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. సబ్జెక్టు నిపుణులూ అదే విషయం చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో డీఎస్సీ కోసం 30వేల మంది వరకు అభ్యర్థులు ఎన్నాళ్ల నుంచో నిరీక్షిస్తున్నారు. వీరిలో చాలా మంది వయోపరిమితి పూర్తయిపోతోంది. ఈ నేపథ్యంలో వయో పరిమితిని పెంచాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇలా..

భర్తీ చేయనున్న పోస్టులు :	1,143
స్కూల్ అసిస్టెంట్ పోస్టులు:	622
ఎస్జీటీ పోస్టులు:	521
వీటితోపాటు గిరిజన పాఠశాలల్లో అదనపు పోస్టులు :	16

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 పోస్టులు

డీఎస్సీ–2025 ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ 622, ఎస్జీటీ 521 ఉన్నాయి. వీటితో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరో 16 పోస్టులు భర్తీ చేయనున్నట్లుగా చూపారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా తెలుగు 42, హిందీ 57, ఇంగ్లీషు 69, మాథ్స్ 35, ఫిజికల్ సైన్స్ 58, బయాలాజికల్ సైన్స్ 86, సోషల్ 109, ఫిజికల్ ఎడ్యుకేషన్ 166తో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 521 ఉన్నాయి.

మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

డీఎస్సీ–2025కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 20 నుంచి మే 15 వరకు గడువు ఇచ్చారు. మే 20 నుంచి మాక్‌టెస్ట్‌లు జరగనున్నాయి. మే 30 నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడింగ్, జూన్ 6వ తేదీ నుంచి జూలై ఆరు వరకు ఆయా కేటగిరీల వారీగా పరీక్షలు జరగున్నాయి. పరీక్షల నిర్వహణ అనంతరం ప్రాథమిక కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ, తుది కీ విడుదల చేసి, మెరిట్ ప్రకటించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్‌లో పొందుపర్చారు.

90 రోజుల వ్యవధి అవసరం



డీఎస్సీ దరఖాస్తు గడువు, పరీక్షలకు మధ్య వ్యవధి చాలా తక్కువ ఉంది. విస్తృత సిలబస్‌ను పూర్తి చేసేందుకు 45 రోజులు సరిపోవు. విద్యాశాఖ హడావుడిగా షెడ్యూల్ ఖరారు చేసింది. కనీసం 90 రోజుల వ్యవధి అవసరం. అభ్యర్థుల వయోపరిమితిని 44 ఏళ్ల నుంచి 47 ఏళ్లకు పెంచాలి. 2018 తరువాత చేపడుతున్న డీఎస్సీ కావడంతో వేలాది మంది అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు. తెలంగాణలో 46ఏళ్లకు వయోపరిమితి పెంచారు. రాష్ట్రంలో 47ఏళ్లకు పెంచాలి.

– కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాహక్కు చట్టం ద్వారా 2025–26 విద్యాసంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికై అర్హులైన విద్యార్థులు ఈనెల 28 నుంచి మే 15 వరకు విద్యాశాఖ వైబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలో ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న నిరుపేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లను కేటాయించాల్సి ఉందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు htt pr:/cre.ap.gov.i n సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఐదేళ్ల వయసు నిండిన చిన్నారులకు ఒకటో తరగతిలో అడ్మిషన్లు కల్పించాలని, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ ఉన్న పాఠశాలల్లో ప్రవేశానికి గత మార్చి 31, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి వచ్చే జూన్ ఒకటో తేదీ నాటికి ఐదేళ్లు నిండి ఉండాలన్నారు. అర్ఫన్, హెచ్ఐవీ, స్థితికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వారికి ఐదు శాతం, ఎస్సీలకు పదిశాతం , ఎస్టీలకు నాలుగు శాతం, వెనుక బడిన సెక్షన్స్, ఇతరులకు ఆరు శాతం సీట్లు లభిస్తాయన్నారు. ఎంపిక రాష్ట్రస్థాయిలో ఉంటుందన్నారు. మే 18 నుంచి 20వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఉన్న డేటాతో పోల్చుకుని అడ్మిషన్లు ఇస్తారని తెలిపారు. ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ కోసం తల్లిదండ్రులు ఆధార్, రేషన్ కార్డు, ఓటరు కార్డు, భూమి హక్కుల పత్రం, ఉపాధి హామీ పథక జాబ్ కార్డ్, పాస్‌పోర్ట్, విద్యుత్ బిల్లు, రెంటల్ అగ్రిమెంట్ కాపీ, డ్రైవింగ్ లైసెన్సుతోపాటు జనన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించాలన్నారు. సచివాలయాల డేటా ఆధారంగా మే 15 నుంచి 20వ తేదీ వరకు విద్యార్థులు ప్రవేశానికి అర్హతలు స్టేట్ ప్రాజెక్టు ఎస్పీడీ నిర్ణయిస్తారమన్నారు. లాటరీ ద్వారా మొదటి విడత ఫలితాలను మే 21 నుంచి 24 తేదీల మధ్య విడుదల చేస్తారనీ, సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 2న ప్రకటించనున్నట్లు తెలిపారు. రెండో విడత ఫలితాలను జూన్ 6న విడుదల చేస్తారన్నారు. పూర్తి సమచారం కోసం 18004258599 టోల్ ఫ్రీ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

సాగర్‌మాత దేవాలయంలో ఈస్టర్ వేడుకలు

విజయపురిసౌత్: స్థానిక సాగర్‌మాత దేవాలయంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచే ఆలయంలో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు జరిగాయి. అర్థరాత్రి 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భక్తులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఆ తరువాత క్రీస్తు నేడు లేచెను అని నినాదాలు చేశారు. అనంతరం భక్తులు ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దివ్యబలిపూజా కార్యక్రమంలో ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ భక్తులనుద్దేశించి ప్రసంగించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చెడుమార్గాన్ని వీడి మంచి మార్గంలో నడవాలన్నారు. అశాంతిని వీడి శాంతి మార్గంలో, ద్వేషాన్ని వీడి తోటివారితో ప్రేమతో మెలగాలని సూచించారు. 2వేల సంవత్సరాల క్రితం శిలువ వేయబడి చనిపోయిన ఏసుక్రీస్తు మూడో రోజు ఆదివారం పునరుత్థానుడైనట్లు ఉద్బోధించారు. ఈ పునరుత్థానుడైన క్రీస్తును స్మరించుకోవటమే ఈస్టర్ పండుగ ముఖ్య ఉద్దేశమన్నారు. ఏసు చూపిన మార్గంలో నడవాలని వారు పేర్కొన్నారు.



భక్తులకు సందేశం అందిస్తున్న విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్

వేడుకలలో ఆలయ పెద్దలు డి ఇన్నారెడ్డి, ఎం మరియదాసు, జెక్కిరెడ్డి చిన్నపరెడ్డి, శౌర్రాజు, శౌరిబాబు, కట్టా రాజు, చందు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులపై ఆశీలు భారం

- ఏకంగా రూ.10 నుంచి రూ.30కు పెంపుదల
- రోజూ రూ.30 చెల్లించలేం అంటున్న చిన్నవ్యాపారులు
- పట్టణంలో స్ట్రీట్‌వెండర్లు, హాకర్లు రెండు వేలకు పైమాటే!



ఆదినారాయణ, పెరవలి

తెనాలి: పట్టణంలో చిరు వ్యాపారులపై మున్సిపాలిటీ ఆశీలు భారం మోపింది. రోజుకు రూ.10 వసూలు చేస్తున్న ఆశీలు మొత్తాన్ని ఇప్పుడు ఏకంగా రూ.30లకు పెంచింది. చిన్నాచితకా వ్యాపారాలతో పొట్టపోసుకునే వ్యాపారులకు మున్సిపాలిటీ నిర్దయతో భారమైంది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ఎదుగూ బొదుగూ లేని ఆదాయంతో జీవిస్తున్న తమపై అదనపు భారాన్ని తొలగించాలని కోరుతున్నారు.

ఏ పట్టణం చూసినా ఏమున్నది గర్వకారణం.. వీధులనిండా తోపుడుబండ్లు, ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమణలే! అన్న వ్యాఖ్యలు తరచూ వింటుంటాం. స్ట్రీట్ వెండర్లు, హాకర్లుగా పిలిచే ఈ చిరువ్యాపారులు ట్రాఫిక్‌కు అవరోధమని భావించటం పరిపాటి. ప్రభుత్వ అధికారులు, పోలీసుల అదిరింపులు, బెదిరింపులు, పౌరుల ఛీత్కారాల మధ్య బతుకుదెరువు కోసం అలసట లేని జీవన పోరాటం వారిది. జీవించడానికి వేరే ఏమార్గం లేక, కొద్దిపాటి పెట్టుబడితో రోడ్డుపక్కనే ఉపాధిని ఏర్పాటుచేసుకునే చిరువ్యాపారులు పట్టణ పంపిణీ వ్యవస్థలో ముఖ్యభూమిక వహిస్తున్నారు. పట్టణ ప్రజాజీవనంలో వీరి పాత్రను విభజించలేం. పెద్ద షాపులకు వెళ్లి హెచ్చుధరలు పెట్టలేని ప్రజలకు నిత్యావరాలైన కూరగాయలు, పండ్లు, పూలు, గాజులు.. ఇలా ఒకటేమిటి? సమస్త ఉత్పత్తులను అందుబాటులో ఉండే ధరల్లో అందిస్తున్నారు. అయినప్పటికీ పాలకులు, అధికారులు, ప్రజలకు వీరంటే చిన్న చూపే. స్థానికంగా ఉండే పోలీస్, మున్సిపల్ సిబ్బంది కారణంగా ఇబ్బందులు పడుతుంటారు. ఒక్కోసారి తమ సరుకులను నష్టపోతుంటారు. ఏ రాజకీయ నాయకుడో సభ పెట్టారంటే ఆరోజు వ్యాపారం లేనట్టే. మరి కొన్ని సందర్భాల్లో పోలీసు కేసులను ఎదుర్కోవటం, జరిమానా చెల్లించటం అనివార్యం. వాస్తవంలో వారి హృదయాలను తట్టిచూసే ఓపికా, తీరికా మాత్రం ఎవరికీ లేవు.

తెనాలిలో 1700 మంది వీధి వ్యాపారులు

పట్టణంలోని స్ట్రీట్‌వెండర్లు, హాకర్లు గతేడాది అధికారికంగా 1650 వరకు ఉన్నారు. ఈ సంవత్సరం వారి సంఖ్య 1700 పైగానే ఉంటుందని అంచనా. వీరిలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలు, మొక్కజొన్న కండెలు, కొబ్బరి బోండాలు దుస్తులు, చిన్నచిన్న వస్తువులు విక్రయించేవారే అధికం. ప్రధానంగా మార్కెట్ ఏరియా, మెయిన్‌రోడ్డు, గాంధీచౌక్, శివాజీచౌక్, చెంచుపేట, నెహ్రూరోడ్డులో అధికంగా ఉంటారు. ఇతర ప్రాంతాల్లో రోడ్డు వెంట ఉండే అమ్మకాలు చేస్తుండే చిరువ్యాపారులు కనిపిస్తుంటారు. ఎక్కువగా సైకిళ్లపై వ్యాపారాలు చేస్తుంటారు. ఇరువైపులా వ్యాపార దుకాణాలు ఉండే మెయిన్‌రోడ్డు 'తోపుడుబండ్ల వ్యాపారుల హబ్' అంటారు. ఉదయం పూట రోడ్డుకు రెండుపక్కలా పదులసంఖ్యలో మహిళలు రోడ్డుపైనే గంపలు లేదా నేలపైనే కూరగాయలు, పూలు, పండ్లు పార్ట్‌టైమ్ అమ్మకాలు చేస్తుంటారు. స్థానికులతోపాటు సమీపగ్రామాల్నుంచి వీరంతా పట్టణానికి వచ్చి ఉపాధిని పొందుతుంటారు. యువకులు, స్త్రీలు, వృద్ధులు సైతం స్ట్రీట్ వెండర్లుగా జీవనం గడుపుతున్న దృశ్యాలు ఎటుచూసినా కనిపిస్తాయి. ఎండలో ఎండుతూ వర్షాలకు తడుస్తూనే వ్యాపారాలు చేస్తుంటారు. వర్షాలు బాగా కురిసే రోజుల్లో ఏరోజైనా కాసేపు తెరిపివ్వకపోతే ఆ రోజుకు నాలుగు రూపాయలు కళ్లచూసే అవకాశాన్ని కోల్పోతారు.

ఆశీలుపై ఆవేదన

ఇలా అవస్థలు పడుతూ వ్యాపారాలు చేస్తూ పొట్టపోసుకునే చిరువ్యాపారులు కూడా చాలా మందికి ఆదాయ వనరులయ్యారు. తమ దుకాణం లేదా ఇంటి ముందు రోడ్డుపై వ్యాపారం చేసుకునే చిరువ్యాపారుల నుండి రోజుకింతని యజమానులు వసూలు చేసుకుంటూ ఉంటారు. అదేమని అడిగితే ఆ మాత్రం చోటు కూడా ఇవ్వరని, వారు అడిగిన మొత్తం ఇచ్చేస్తుంటారు. ఇలాంటి వారినుంచి రోజుకు రూ.100 వరకు తేరగా వసూలుచేసే యజమానులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. పట్టణ మున్సిపాలిటీ ఒక్కో చిరువ్యాపారి నుంచి రోజుకు రూ.30 చొప్పున వసూలు చేస్తోంది. ఇంతకుముందు రూ.10 చొప్పున వసూలు చేసే ఆశీలు ఇప్పుడే ఏకంగా రూ.30 వరకు పెంపుదల చేశారు. మార్కెట్ షాపులను వేలం పాట నిర్వహించిన తర్వాత వేలం పాడుకున్న వ్యాపారి, చిన్నచిన్న వ్యాపారుల నుండి కూడా రోజుకు రూ.30 వసూలుచేస్తున్నారు. ఇది తమకు భారంగా పరిణమించిందని వారంతా ఆవేదన పడుతున్నారు. ఆశీలు భారం తగ్గించాలని కోరుతున్నారు.

కదం తొక్కిన ముస్లింలు



చిలకలూరిపేటలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



తహసీల్దార్ షేక్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంజుమన్ కమిటీ

వక్ఫ్‌ను నిర్వీర్యం చేసేందుకే..



ముస్లిం సమాజ క్షేమం, ధార్మిక సేవలకు ఇచ్చినవే వక్ఫ్ ఆస్తి. ఎన్డీయే ప్రభుత్వం మైనార్టీలను శత్రువులుగా భావిస్తోంది. అందులో భాగమే వక్ఫ్ కొత్త చట్టం. వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేసే అంశాలు ఇందులో ఉన్నాయి. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– షేక్ దరియావలి, వైఎస్సార్ సీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చిలకలూరిపేటలో వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా భారీ ర్యాలీ

వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలంటూ అంజుమన్ ఇ ఇస్లామియా, జమాతే ఉలమా పిలుపుతో చిలకలూరిపేటలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. చట్టం ఉపసంహరణ వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. పలువురు మాట్లాడారు.

–చిలకలూరిపేటటౌన్

సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలి



కేంద్రంలో బీజేపీ పొత్తుతో, రాష్ట్రంలో ముస్లిం ఓట్లతో అధికారంలోకి వచ్చిన టీడీపీ, వక్ఫ్ సవరణ చట్టం వల్ల మైనార్టీలో అతిపెద్దదైన ముస్లిం వర్గాలకు మతపరమైన రాజ్యాంగ హక్కు హరిస్తుందని..దానిని రద్దు చేయాలని కేంద్రాన్ని ఎందుకు ఒప్పించడం లేదో సీఎం చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పాలి. ముస్లింల ఓట్లతో రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న సీఎం చంద్రబాబు పార్లమెంట్, లోక్‌సభలో కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసి, సదరు బిల్లు రద్దుకు సుప్రీం కోర్టులో పిల్ వేసే ధైర్యం ఉందా అంటూ సవాల్ విసిరారు.

– మాజీ మంత్రి విడదల రజిని

ప్రజల మధ్య విద్వేషాలు రాజేయడం సరికాదు...



మత విభజనకు, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుంది. ముస్లింలే కాదు ప్రజలందరూ వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలంటూ దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. శాంతియుత పోరాటాలు ఉధృత ఉద్యమాలు కాకమునుపే చట్టాన్ని రద్దు చేయాలి.

– కొల్లా రాజమోహన్‌రావు, నల్లమడ రైతుసంఘం నాయకులు

ప్రజాస్వామ్య వ్యతిరేక బిల్లులు చెల్లవు



ప్రజాస్వామ్యానికి, లౌకికవాదానికి వ్యతిరేకమైన ఈ చట్టాన్ని కేంద్రం వెనక్కు తీసుకోవాలి. ముస్లింలు చేసే ఈ ధర్మ పోరాటానికి క్రైస్తవ సంఘాల తరుపున మద్దతునిస్తాం.

– నందమూరి క్రిష్టోఫర్, అధ్యక్షులు, పాస్టర్స్ ఫెలోషిప్ పల్నాడు జిల్లా

కమ్యూనిస్టు పార్టీల నిరంతర పోరాటం



కార్పొరేట్ల అభ్యున్నతికి కార్మిక చట్టాలు, అన్నదాతను రోడ్డుపై పడేసి వ్యవసాయ నల్ల చట్టాలు, రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ చట్టం ఇలా దేశ ప్రజల పట్ల నిరంకుశ వైఖరి పాలన చేస్తుంది. ఆయా చట్టాల రద్దు కోసం కమ్యూనిస్టు పార్టీలు నిరంతర పోరాటం చేస్తున్నాయి.

– తాళ్లూరి బాబూరావు, వెంకటేశ్వర్లు సీపీఐ, సీపీఎం నాయకులు

రాజ్యాంగ విరుద్ధపు చట్టాలు చెల్లవు



ఆర్టికల్ 13లో రాజ్యాంగం స్పష్టం చేసింది. ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే, కించపరిచే చట్టాలు చెల్లవు. ప్రాథమిక హక్కులలో ప్రధానమైంది సమానపు హక్కులు 14–18 వరకు, 28–29 మత స్వాతంత్ర్య హక్కు. వీటికి వ్యతిరేకంగా ఈ బిల్లును తీసుకురావడం ఈ దేశ ముస్లింను ద్రోహం చేయడమే.

– అబ్దుల్ జబ్బార్, ముస్లిం జేఏసీ నాయకులు

ప్రజా విశ్వాసాన్ని కోల్పోతున్న కేంద్రం



భారతదేశం భిన్నమతాలకు నిలయం. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను రాజ్యాంగం ఈ దేశ ప్రజలకు కల్పించిన హక్కు. ఆ హక్కుల్ని ప్రతి మనిషి, మతాలు అనుభవించాలనే అందులో రాయబడ్డాయి.

– సీహెచ్ సుబ్బారావు, అధ్యక్షులు, భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి

బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో ప్రతిదీ పోరాటామే ...



వక్ఫ్‌లో ప్రభుత్వ భూమి ఒక్క సెంటు లేదు. ముస్లింలు వారి ధార్మిక, సేవా కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రజలు, పెద్దలు, రాజులు దానంగా ఇచ్చిన భూములపై మతోన్మాద పార్టీ పెత్తనం ఏంటీ? గతంలో ఎన్ఆర్సీ, సీఏఏ చట్టాలు చేశారు.

– ఎం రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి

నేడు ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

జెట్టిపాలెం(రెంటచింతల):జెట్టిపాలెం ఆదర్శ పాఠశాల(ఏపీ మోడల్ స్కూల్)లో 6వ తరగతిలో ప్రవేశానికి 2025–2026 విద్యాసంవత్సరానికి మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు సోమవారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్షలో పొందిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. మార్చి నెల 31లోపు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21 న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఓసీ, బీసీ విద్యార్థులు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు కనీసం పొందాల్సి ఉంటుందని వివరించారు.

కోడెదూడ వితరణ



అచ్చంపేట: విశ్వహిందూ పరిషత్ గోరక్ష విభాగ్ సహకారంతో మండలంలోని తాళ్లచెరువులోని ఆవుల సంఘ గోశాల వారిచే వ్యవసాయ అవసరాల నిమిత్తం గ్రామానికి చెందిన పెంటారెడ్డి చిన్నపరెడ్డి అనే రైతుకు నాలుగు సంవత్సరాల కోడెదూడెను ఆదివారం ఉచితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకులు తుమ్మా మల్రెడ్డి మాట్లాడుతూ తాము నిర్వహిస్తున్న గోశాలలో కోడెదూడలను వ్యవసాయ అవసరాల నిమిత్తం వాడుకునే వారికి ఉచితంగా ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా విశ్వహిందూ పరిషత్ గోరక్షా ప్రముఖ్ బాగవతుల రవికుమార్, సీనియర్ కార్యకర్త వీరభద్రయ్య, క్రోసూరు ప్రముఖ్ సిద్దు కామేశ్వరాచారి, అచ్చంపేట ప్రముఖ్ జలసూత్రపు తిరుపతి స్వామి తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి మహిళకు గిన్నిస్ రికార్డు



సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన మహిళ పాపిశెట్టి అనూష గిన్నిస్ బుక్ ఆఫ్ ది రికార్డు ధ్రువీకరణ పత్రం అందుకుంది. విజయవాడకు చెందిన హలేల్ మ్యూజిక్ స్కూల్ డైరెక్టర్ అగస్టీన్ పాస్టర్ ఆధ్వర్యంలో 2024 డిసెంబర్ 7న 1,046 మంది విద్యార్థులు కలిసి గంట సమయంలో స్వరాలు వాయించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. దీనిని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు వారు గుర్తించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానాన్ని కేటాయించారు. ఇటీవల హైదరాబాదులోని లైఫ్ చర్చిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో మొత్తం 18 దేశాల నుంచి ప్రజలు హాజరయ్యారు. అనూషకు రికార్డు ధ్రువీకరణ పత్రం, మెడల్‌ను గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధి ఆనంద్ రాజేంద్రన్, హలేల్ మ్యూజిక్ స్కూల్ డైరెక్టర్ ఆగస్టీన్, పాస్టర్ అనిల్ కుమార్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. అనూష మాట్లాడుతూ తన తల్లిదండ్రులు, భర్త సహకారంతో ఇది సాధించానని ఆనందంతో చెప్పింది.

గోల్డెన్ ప్రైమ్ సిటీ బ్రోచర్ ఆవిష్కరణ



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): అమరావతి మండలం నరుకుళ్ళపాడు గ్రామంలో 12 ఎకరాలలో సీఆర్డీఏ అప్రూవల్‌తో వారాహి ఇన్‌ఫ్రా టౌన్‌షిప్స్ వారి గోల్డెన్ ప్రైమ్ సిటీ బ్రోచర్‌ను ఆదివారం సంస్థ చైర్మన్ కొండవీటి శ్రీనివాసరావు, డైరెక్టర్స్ దేవమిత్ర రాజా, అరుణ్‌ప్రశాంత్, సాయి ఆదిత్య స్కూల్ డైరెక్టర్ రవీంద్రబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ లక్కీడిప్‌లో పాల్గొనే అవకాశం కల్పించి గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా కారు, రెండు, మూడు బహుమతులుగా రాయల్ ఎన్‌ఫీల్డ్, టీవీఎస్ స్కూటీని విజేతలకు అందించారు. ఫ్లాట్ బుకింగ్ చేసిన ప్రతి ఒక్కరికీ 2 గ్రాముల గోల్డ్ కాయిన్ అందించారు. గతంలో కేఎస్ఆర్ డవలపర్స్ పెదపరిమి, గొర్లవారిపాలెంలో పంచాక్షరి గార్డెన్స్ దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. జొన్నలగడ్డలో వారాహి ఇన్‌ఫ్రాజ్యూయల్ సిటీ, విజయవాడలో నిడమానూరులో ఎంబసి విల్లాస్ పూర్తి కావస్తుందని నిర్వాహకులు తెలిపారు.

రసవత్తరంగా ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు



పోటీల్లో బండలాగుతున్న ఎడ్లు

వినుకొండ: జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు మండలంలోని మదమంచిపాడులోని మక్కెన చినరామయ్య ఆడిటోరియంలో రసవత్తరంగా సాగుతున్నాయి. నాలుగు పళ్ల సైజు విభాగంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎద్దులు 5160.2 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించాయి. నూజెండ్ల మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన జక్కిరెడ్డి చిన్న సుబ్బారెడ్డి ఎడ్లు 5061.7 అడుగులు లాగి 2వ బహుమతి, పెదకాకాని మండలం తక్కెళ్లపాడుకు చెందిన మోపర్తి నవీన్‌కు మార్‌చౌదరి ఎడ్లు 4809.2 అడుగులు లాగి 3వ స్థానంలో నిలిచాయి. 4వ బహుమతి మండలపు భాష్యిక్ రెడ్డి, జ్ఞానత్ రెడ్డి (ఇస్సాపాలెం) ఎడ్లు, 5వ బహుమతి చిలుకూరి నాగేశ్వరరావు (బాపట్ల మండలం జె.పంగులూరు), 6వ బహుమతి మేస్త్రి ఖాదర్‌మస్తాన్ ఎడ్లు (యద్దనపూడి, బాపట్ల), 7వ బహుమతి యద్దనపల్లి మనోజ్‌కుమార్ చౌదరి ఎడ్లు (రావిపాడు, నరసరావుపేట), 8వ బహుమతి బత్తుల శ్రీనివాసరావు ఎడ్లు (నవలూరు, మంగళగిరి), 9వ బహుమతి పసుమర్తి దివ్య శ్రీ ఎడ్లు (భీమవరం, సత్తెనపల్లి) సాధించాయి. కార్యక్రమంలో నిర్వాహకులు మక్కెన వెంకట్రావు, సుబ్బారెడ్డి, చిరంజీవి, కోటిరెడ్డి, అబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెనిగండ్ల కల్యాణ మండపంలో దోపిడీ

- మైక్, లైటింగ్, డెకరేషన్ పేరిట వసూళ్లు
- వేలంపాటలు నిర్వహించకుండా పంచాయతీ ఉద్యోగుల దొంగాట
- పారిశుద్ధ్యం పేరుతో ప్రత్యేక రుసుం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచి వెనిగండ్ల



వెనిగండ్లలో దాతలు నిర్మించిన మైత్రి కల్యాణ మండపం

పెదకాకాని: వెనిగండ్లలోని మైత్రి కల్యాణ మండపంలో లైటింగ్, డెకరేషన్‌కు వేలంపాటలు నిర్వహించకుండా కొందరు పంచాయతీ ఉద్యోగులు సొమ్ము చేసుకుంటున్నారని గ్రామ మాజీ సర్పంచి, వైఎస్సార్ సీపీ నాయకుడు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. వెంటనే పాటలు నిర్వహించి గ్రామ పంచాయతీ ఆదాయం పెంచాలని అధికారులను కోరారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో ప్రభుత్వ భూమిలో కొందరు గ్రామ పెద్దలు సుమారు రూ.కోటి నిధులు సేకరించి కల్యాణ మండపాన్ని నిర్మించారు. గ్రామస్తులకు తక్కువ ధరకు అద్దెకు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే దీనిని స్వాధీనం చేసుకున్న పంచాయతీ అధికారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. మండపాన్ని ఓసీలకు రూ.18,500కి, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.12,500కు ఇస్తున్నారు. ప్రతి వేడుకకూ మరుగుదొడ్ల శుభ్రత పేరుతో మరో రూ.500 వసూలు చేస్తున్నారు. మైక్, లైటింగ్, ఫ్లవర్ డెకరేషన్ పేరుతో మరింత దోపిడీ చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ వసూళ్ళు పంచాయతీ సిబ్బంది కనుసన్నల్లో జరుగుతున్నట్లు సమాచారం. గత ఏడాది మైత్రి కల్యాణ మండపంలో 175 వేడుకలు జరిగాయి. మైక్ అండ్ లైటింగ్, పూల అంకరణను కొందరు ప్రైవేటు వ్యక్తులు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. దీనిలో పంచాయతీ ఉద్యోగులకు వాటాలు వెళ్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కల్యాణ మండపంలో లైటింగ్, పూల అలంకరణకు వేలంపాటలు నిర్వహించకపోవడంతో పంచాయతీ ఏటా రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఆదాయం కోల్పోతోంది. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి వేలంపాటలు నిర్వహించాలని మాజీ సర్పంచి కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ వర్గీయులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

- డిమాండ్ చేసిన దేశభక్త ప్రజాతంత్ర నాయకులు
- గంటావారిపాలెం ఎస్టీలపై టీడీపీ దాడులకు ఖండన
- తమకు ఓటు వేయలేదనే కారణంతో దాడిచేశారని ఆరోపణ



దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాధితుడు

నరసరావుపేట: శ్యావల్యాపురం మండలం గంటావారిపాలెంలో తమకు ఓట్లు వేయలేదనే కారణంతో టీడీపీ నాయకులు ఓ ఎరుకల కుటుంబంపై చేసిన దాడిని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు ఖండించారు. ఆదివారం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు ఈ ఘటనపై మాట్లాడుతూ గ్రామంలో ఒక ఎరుకల కుటుంబం చికెన్ స్టాల్, చిల్లరకొట్టు ఏర్పాటు చేసుకొని జీవిస్తోందని, వారు గత సార్వత్రిక అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో తమకు ఓట్లు వేయకుండా వైఎస్సార్ సీపీకి వేశారనే కారణంతో షాపులు కూల్చివేసి నిర్వాహకుడు నాగేశ్వరరావును తీవ్రంగా గాయపరిచారని పేర్కొన్నారు. సుజాత అనే మహిళ జాకెట్‌లో ఉన్న సెల్‌ని బలవంతంగా లాక్కొని ఆమెపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వేల్పూరు, గంటావారిపాలెం గ్రామాలకు చెందిన వారిపై ఎస్సీ, ఎస్టీ చట్టం మేరకు కేసు నమోదుచేసి నిందితులందరినీ అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. షాపును కూల్చిన పొక్లెయినర్‌ను సీజ్ చేయాలని, సుమారు రూ.18 లక్షల ఆస్తిని నష్టపరచడమే కాక వారిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి ఎస్టీ కుటుంబానికి రక్షణ కల్పించాలని పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు.

జోరుగా క్రికెట్ బెట్టింగ్

- వాట్సప్‌లోనే లక్షల రూపాయలు బెట్టింగ్
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న సీసీఎస్ పోలీసులు!

మంగళగిరి: ఐపీఎల్ క్రికెట్ సీజన్ కావడంతో నగరంలో బెట్టింగ్ జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో జూదరులపై నిఘా పెట్టిన పోలీసులు ఆదివారం ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సెల్ ఫోన్ వాట్సాప్‌లలోనే లక్షల రూపాయల బెట్టింగ్ జరుగుతుండడంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న సీసీఎస్ పోలీసులు రహస్యంగా గుంటూరు తరలించి తమదైన శైలిలో విచారిస్తున్నట్లు తెలిసింది. స్థానిక పోలీసులకు సమాచారం లేకపోవడం విశేషం. జూదరుల నుంచి ఎనిమిది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు పూర్తి స్థాయిలో విచారిస్తున్నట్లు తెలిసింది. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకెలాంటి సమాచారం లేదని తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో 110వ ర్యాంకు



దిగేశ్వర్ నాయక్

మాచర్ల రూరల్: మాచర్ల మండలం హసనాబాద్ తండాకు చెందిన కేతావత్ దిగేశ్వర్ నాయక్ ఆల్ ఇండియా లెవల్‌లో జేఈఈ మెయిన్స్‌లో 110వ ర్యాంకు సాధించినట్లు తండ్రి కేతావత్ రూప్లానాయక్ ఆదివారం తెలిపారు. విజయవాడలోని పోరంకిలో నారాయణ కాలేజీలో విద్యనభ్యసిస్తున్న దిగేశ్వర్ నాయక్ ఆల్ ఇండియా స్థాయిలో 110 వ ర్యాంకు సాధించటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన లఘు నాటికల ప్రదర్శన



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం సాయంత్రం గుంటూరు హ్యూమర్ క్లబ్ 12వ వార్షికోత్సవాలు జరిగాయి. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సంస్థ సభ్యులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. వేడుకలకు సంస్థ ఉపాధ్యక్షులు మధువని అధ్యక్షత వహించారు. అనంతరం ఓర్నీ, పోవోయి అనుకోని అతిథి లఘు నాటికలు ప్రదర్శించారు. ఇవి సభికులను అలరించాయి. దర్శకులు గుడివాడ లహరి, సీహెచ్.అమృతవర్షిణి, క్లబ్ వ్యవస్థాప కార్యదర్శి షేక్ లాల్‌వజీర్, కార్యదర్శి అత్తలూరి నాగజ్యోతిలు ప్రసంగించారు. నటీనటులు మధువని, నాగజ్యోతి, ప్రత్తిపాటి మంగయ్య, డాక్టర్ ఎస్‌వీకృష్ణప్రసాద్, గుడివాడ లహరి, ఎ.రాజశేఖర్, పెండ్యాల రమేష్‌బాబు, ప్రదీప్‌కుమార్, ఎం.క్రిష్ణకిషోర్ తమ పాత్రల్లో నటించి ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు.

అక్కడ అబ్బాయి.. ఇక్కడ అమ్మాయి



పెదవడ్లపూడి(మంగళగిరి) : ప్రేమించుకున్న జర్మనీ అబ్బాయి ఆంధ్రా అమ్మాయి ఇరు కుటుంబాల అంగీకారంతో ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరికి సమీపంలోని పెదవడ్లపూడిలో ఒక్కటయ్యారు. వీరి వివాహం హిందూ సంప్రదాయం ప్రకారం వైభవంగా జరిగింది. పెదవడ్లపూడికి చెందిన సుందర్శనం రవికుమార్, లక్ష్మీ దంపతుల కుమార్తె మౌనిక జర్మనీలో పీహెచ్‌డీ చేస్తూ ఉద్యోగం చేస్తున్నారు. అదే కంపెనీలో ఉద్యోగం చేస్తున్న జర్మనీకి చెందిన ఫాబియన్ డువెన్ బేక్‌తో పరిచయమై అది ప్రేమగా మారింది. దీంతో ఇరువురూ తమ ఇళ్ళల్లో తల్లిదండ్రులకు తెలియజేసి అందరి అంగీకారంతో పెదవడ్లపూడి సాయిబాబా ఆలయంలో వైభవంగా వివాహం చేసుకున్నారు.

కర్మకాండలు చేయడానికి వెళ్తూ మృత్యుఒడికి..

రోడ్డు ప్రమాదంలో జంగం దేవర మృతి



ప్రమాదానికి కారణమైన కారు



మృతి చెందిన మామిడి వీరలింగం

నాదెండ్ల: కర్మకాండలు చేయడానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో జంగం దేవర దుర్మరణం పాలైన విషాద ఘటన జాతీయ రహదారిపై గణపవరం ప్రసన్నవంశీ స్పిన్నింగ్ మిల్లు సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన మామిడి వీరలింగం (70) జంగం దేవరగా కర్మకాండలు నిర్వహిస్తుంటాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులుగా కాగా, చిన్నకుమారుడు శివలింగం కుల వృత్తిలోనే కొనసాగుతున్నాడు. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో తిమ్మాపురంలో ఓ మృతునికి కర్మకాండలు నిర్వహించేందుకు తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వీరలింగం బయలుదేరాడు. ప్రసన్నవంశీ స్పిన్నింగ్ మిల్లు వద్దకు రాగానే సర్వీసు రోడ్డు నుంచి హైవే ఎక్కుతుండగా, చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపునకు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనం ఇరవై అడుగుల దూరంలో పడగా, వీరలింగం అక్కడికక్కడే మృతి చెందాడు. కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. సమాచారం తెలుసుకున్న నాదెండ్ల ఎస్సై పుల్లారావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వీరలింగం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఏఎంసీ చైర్‌పర్సన్ ప్రమాణస్వీకారోత్సవం



ఏఎంసీ ప్రమాణస్వీకారంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, విగ్రహాల ఆవిష్కరణకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ పశుసంవర్ధక పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం సత్తెనపల్లి చేరుకున్నారు. తొలుత సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో నూతన సచివాలయ భవనం, ఆర్‌బీకే బిల్డింగ్, నూతన సీసీ రోడ్, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ షెడ్‌లను ప్రారంభించారు. అనంతరం సత్తెనపల్లి చేరుకొని పట్టణంలోని 21వ వార్డులో స్వర్గీయ నందమూరి తారకరామారావు, గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారిలోని తాలూకా సెంటర్‌లో డివైడర్‌పై నూతనంగా నిర్మించిన స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కోమటినేని శోభారాణి, పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో రాష్ట్ర చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, డాక్టర్ కోడెల శివరామ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిభద్రతల కోసమే విస్తృత తనిఖీలు



పట్టణంలోని ఓ లాడ్జిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నరసరావుపేట: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాలతో పోలీసులు జిల్లా వ్యాప్తంగా వివిధ హోటళ్ల, లాడ్జిలలో శనివారం అర్ధరాత్రి వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలతో పాటు హోటళ్ల, లాడ్జీల లాగ్‌బుక్‌లను పరిశీలించారు. గుర్తింపు పత్రాల నమోదు, విధానం తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించారు. మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని లాడ్జి యాజమానులకు స్పష్టమైన సూచనలు చేశారు. పరారీలో ఉన్న నిందితులు, అనుమానితులు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులపై నిఘా ఉంచేందుకు ఈ తనిఖీలు దోహదం చేస్తాయని ఎస్పీ వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి తనిఖీలను మరింత కఠినంగా కొనసాగించనున్నామని, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.